# దేవదాసు బ్రతికి పోయాడు

"పార్వతి నిన్ను ప్రేమిస్తోంది"

"అలాగా" అన్నాడు దేవదాసు మిత్రుడి మాటలకు.

"అలాగా అంటావేమిటి నీకర్థమయిందా నేచెప్పేమాట. ఓ దేవదాస్! పార్వతి నిన్ను ప్రేమిస్తోంది"

"ప్రేమించటం అంటే ఏం చేస్తున్నది?

"ప్రేమిస్తే ఏం చేస్తారు... నీ గురించే ఆలోచించటం... కలలుకనటం"

"అసలు ఎందుకు ప్రేమించటం?"

అదిరిపడ్డాడు మిత్రుడు ప్రేమకు కారణం అడిగితే. అంతకన్నా క్రూరుడు ఇంకెవరు ఉండరనిపించింది.

"ఏమిట్రా దేవదాస్ ఏమిటి నీవడిగింది?"

పార్వతి ఎందుకు ప్రేమిస్తున్నది? అదీ, నన్నే ఎందుకు ప్రేమించడం?

మరోసారి అదిరిపడ్డాడు మిత్రుడు, పార్వతి దేవదాస్‌నే ఎందుకు ప్రేమిస్తోందో కారణం తనకి కూడా తెలియనందుకు. అయినా కప్పిపుచ్చుకొని,

"ప్రేమకు కారణం ఉండదు దేవదా..." అంటూ ఒక గొప్పనిజం చెప్తున్న ప్రవక్తలా గంభీరంగా అయిపోయాడు మిత్రుడు. ఆ స్వరంలో బుకాయింపు ఉందనిపించింది దేవదాసుకు.

"ఉండదని నీవు చెప్తున్నావా— పార్వతి చెప్పిందా?"

పార్వతి, నేను... ఆ మాటకొస్తే షెల్లీ, కీట్స్, కృష్ణశ్రీ...

"ఆగు, విసుక్కున్నాడు దేవదాసు. నీకు తెలిసిన పేర్లు అన్నీ చెప్పకు. నిజంగా వాళ్ళు అన్నారో లేదో నాకనవసరం నేనడిగింది మీ ఇద్దరి సంగతి. పార్వతి అన్నదా 'ప్రేమకు కారణం ఉండదు అని'.

"నాతో అనలేదు అనుకో... కానీ ఇది యూనివర్సల్ నిజం తెలుసా! ప్రేమకు రీజను, సీజను లేవని ఓ పాట ఉంది తెలుసా"

"తెలియదు అయినా నేనొప్పుకోను"

"దేవదాస్ అని పేరు పెట్టుకుని ఆ పేరుకి, ప్రేమకి పార్వతికి ద్రోహం చేస్తున్నావురా"

"సరే పార్వతి నన్ను ప్రేమిస్తుంది. అది ఆ అమ్మాయి ఇష్టం. నన్ను ప్రేమించటం ఆ అమ్మాయి ఛాయిస్. అయితే ఆ సంగతి నాతో చెప్పమని నిన్ను అడిగిందా?"

"లేదనుకో..."

"మరి ఎందుకు చెప్పావు"

"నీవూ ప్రేమించాలని"

"ఎందుకు?"

"అదిగో మళ్ళీ కారణం అడుగుతున్నావు. మనం ప్రేమించే వాళ్ళు దొరకటం కన్నా— మనల్ని ప్రేమించే వాళ్ళు దొరకటం కష్టం.

"ఇదంతా నాకొద్దు. పార్వతి నన్నే ఎందుకు ప్రేమిస్తుందో కనుక్కో... నా జవాబు అప్పుడు చెప్తాను"

"దేవదా! కారణం గీరణం అని అడగకుండా నీవూ ఓ రెండు రోజులు నేను చెప్పినట్లు చెయ్. తర్వాత నీక్కూడా పార్వతి మీద ప్రేమ కలగకపోతే అప్పుడు నన్ను అడుగు. నీకూ తెలుస్తుంది ప్రేమకు కారణం లేదని"

"ప్రేమ కలగకపోతే...?"

"కలిగితీరుతుంది"

"నేను అడిగింది కలగకపోతే... అని"

"నేను ఓ అమ్మాయి బస్‌స్టాపులో నాలుగు రోజులు వరుసగా చూసుకొనేసరికి ప్రేమలో పడ్డాం తెలుసా"

"అయి ఉండవచ్చు. నీకిది నాలుగో ప్రేమో— అయిదో ప్రేమో. నీ సంగతి కాదు నేను మాట్లాడేది. నా సంగతి"

"సరే— నీకూ ఆ అమ్మాయికి రాం రాం! ఎప్పుడు పార్వతి ఊ సెత్తను.

"ఒకే! నీకిచ్చిన మాట ప్రకారం ఒకరోజు నీవు చెప్పినట్లు వింటాను. అయినా ఈ లోపు నా కోసం వీలు అయితే ఒకసారి ఆ అమ్మాయి నడుగు. ఆ అమ్మాయి నన్నే ఎందుకు ప్రేమిస్తోం దని?" జవాబు ఏదయినా రెండు రోజులు నీవు చెప్పినట్లు వింటాను"

"సరే!"

* * *

"విన్నారుగా వాడి మాటలు 'దేవదాస్ తల్లి అడిగింది' పిలిచి కాస్త మందలించండి.

"చూడు కన్నాంబా! వాళ్లే మందలించడం అనవసరం అసలు ఎంత దూరంవెళ్తాడోచూద్దాం" అన్నారు హుషారుగా ఎస్వీరావుగారు.

ఆయన కొడుకుని పెంచలేదు. ఎదగనిచ్చారు గైడ్ చేస్తూ అయితే ఆ రోజు రాత్రి స్టడీ రూమ్‌లో ఉండగా దేవదాసే ఈ సంగతి కదిలించాడు.

"నాన్నగారు! పార్వతి ప్రేమిస్తున్నానని కబురు చేసింది."

"సాయంకాలం విన్నానురా! ఆ పిల్ల నీతో డైరెక్ట్‌గా చెప్పలేదు. ఎవరితోనో చెప్పింది. అవునా డీడీ!"(డీడీ అనగా దేవదాస్)

"ఆడపిల్ల కదండీ!"

"డీడీ— ఆ అమ్మాయి వైపు నుండి కన్ఫెషనల్ గా ఆలోచిస్తున్నావన్నమాట"

'ఈ చెప్పించటం మటుకు అంతేఅనుకోండి"

"నీ ఉద్దేశ్యం ఏమిటి? మిత్రుడికిచ్చిన మాట కోసం ఓ రెండు రోజులు నీవూ ప్రేమించటానికి ప్రయత్నిస్తావా?"

"వాడికోసం కాదు. నిజంగా నచ్చితే స్నేహం చేద్దాం అని"

"ఎందుకు.....?"

"ఇంకెందుకండీ... పెళ్ళి చేసుకోవటానికే!"

"ఆల్ ది బెస్ట్ డీడీ"

"డూ యూ రియల్లీ మీనిట్ డాడీ"

"వై ఐ రియల్లీ మీనిట్ డీడీ!"

"థాంక్యు డాడీ కానీ కారణం లేని ప్రేమ యితే..." ఆగి నవ్వాడు దేవదాసు.

"వెరీగుడ్ డీడీ!"

* * *

ఈ లోపున పార్వతి దేవదాసును ప్రేమించటానికి గలకారణాలు సేకరించాడు మిత్రుడు. అయితే ప్రేమించటంవల్ల అవి కారణాలు అయినాయో, ఆ కారణాలవల్ల ప్రేమించిందో అని దేవదాసు పేచీపెడితే ఇరకాటంలో పడతానని పించింది మిత్రుడికి.

ఆ కారణాలు వింటే బహుశా సావాసదోషం

మొదటిది దేవదాసు బాగా చదువుతాడు. మంచి మార్కులు వస్తాయి.

రెండోది దేవదాసు ఎక్కువ సేపు లైబ్రరీలో కూర్చొని దీక్షగా రకరకాల పుస్తకాలు చదువుతాడు. (ఆ రకరకాలు) ఏమిటో తనెప్పుడూ గమనించలేదనే విషయం మిత్రుడు అడిగిన మీదట పార్వతి చెప్పింది. ఎందుకయినా మంచిదని మిత్రుడు,ఆ నిజం దేవదాసుకు చెప్పలేదు.

—మూడోది దేవదాసు ఏ ఆడపిల్లవైపు కన్నెత్తి చూడడు. చూడటానికి బాగుంటాడు. నొక్కుల క్రాఫ్ మరీ బాగుంటుంది. (మాకు వంశ పారంపర్యంగా ముప్పయ్యేళ్ళకే బట్టతల వస్తుందని దేవదాసు మిత్రుడి ద్వారా పార్వతికి చెప్పాడు.)

కానీ మిత్రుడు ఈ విషయంలో మిత్రద్రోహం చేశాడు. పార్వతికి ఆ సంగతి చెప్పలేదు.

—నాలుగోది దేవదాసుకు ఆదర్శభావాలు ఉన్నాయి. దేవదాసును పెళ్ళి చేసుకుంటే సుఖంగా బ్రతకవచ్చు.

ఈకారణాలు దేవదాసుకు నచ్చలేదు. వాటిని విశ్లేషిస్తే ఆకర్షణ, సెక్యూరిటీ అనే పదాల దగ్గ రకు వెళుతున్నాయి. ఇది బస్టాప్ ప్రేమలాంటిదే అనిపించింది.

డీడీతో కలిసి పంచుకోవడానికి ఆ పిల్ల వ్యక్తిగతంగా బిల్డప్ చేసుకున్న వాల్యూ ఏదీ లేదు అనుకొన్నారు ఎస్వీరావుగారు. కానీ కొడుకుతో ఆ మాట అనలేదు.

* * *

సాయంకాలం ఏడింటికి హుషారుగా ఈల వేసుకుంటూ వచ్చిన కొడుకును నిలదీశాడు ఎస్వీరావుగారు.

"ఏరా డీడీ హుషారుగా ఉన్నావ్. ఎనీ గుడ్ న్యూస్"

"ఎస్ డాడీ రాం రాం"

"అదేమిట్రా డీడీ... ప్రొద్దుటి నుంచీ తిండి తిప్పలు లేకుండా ఆ పిల్లకోసం..."

"లేదండీ ప్రొద్దునతొమ్మిదింటికేతేలిపోయింది వ్యవహారం. లైబ్రరీ నుండి వస్తున్నా"

"అదేమిట్రా తొలి చూపులో ప్రేమలో పడతారు కానీ— మొదట చూపులో ఇవతలకు పడ్డావంటున్నావ్— ఏం జరిగిందసలు..?"

* * *

మిత్రుడు చెప్పినట్లు ఏడింటికల్లా అతని ఇం టికి వెళ్ళాడు దేవదాసు. పార్వతి ఊహించని చోట— అదీ వాళ్ళింటి పరిసరాల్లో హఠాత్తుగా కనిపించాలన్నాడు మిత్రుడు అందుకని— ఉదయాన్నే పార్వతివాళ్ళ ఇంటి ప్రక్కనే ఉంటున్న మిత్రుడి చుట్టం ఇంటికి లేని పని కల్పించుకుని బయల్దేరాడు.

ఏడున్నరకి వాళ్ళు వెళ్ళేసరికి పార్వతి వాళ్ళ నాయనమ్మ వాకిట్లో ముగ్గులేస్తూ ఉంది.

మిత్రుడి చుట్టం ఇంటి వసారాలో పార్వతి ఇంటికి ఆనుకొని ఉన్న ఇల్లు అది— కూర్చోబెట్టాడు దేవదాసుని. చుట్టం కొంచెంసేపు మర్యాదకు వీళ్ళతోపాటు కూర్చొని పనుంది అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

"నాకు ఒంట్లో బాగాలేదు పొద్దెక్కి లేస్తే అప్పటి దాకా ఊరుకోవటమేగానీ ఎవరూ వాకిలి చిమ్మి ముగ్గులేయరు. దానికేమో పని సరిపోతుంది. ఇద్దరాడపిల్లలు ఉన్నారు ప్రొద్దున్నే లేచి వాకిట్లో ముగ్గువేయటానికి బద్ధకం. నామోషి. రాత్రి తొమ్మిదింటికి పడుకుంటారు తెల్లారి ఎనిమిది అయినా లేవరు. అదీ నాన్న గారాబం. పైగా చదువుకుంటున్నారని సంబరం...


దాదాపు అరగంట సేపు వినుక్కున్న మాటల సారాంశం అది.

"ముసల్దానికి తెల్లారింది. అప్పుడే నస మొదలు పెట్టింది" పార్వతి ఇంట్లోనుంచి.

"పార్వతి కంఠంలాగే వినిపిస్తే— కం గారుగా మిత్రుడు వైపు చూశాడు దేవదాసు. వాడో వెకిలి నవ్వు నవ్వి" పార్వతి చెల్లెలు సరస్వతి" అన్నాడు.

"అలాగా ఏం చదువుతోంది?" అనిఅడిగాడు.

"సరస్వతా? పాపం సరస్వతిది... పాపం ఇంటర్ పోయింది" వాడి వెధవ సిగ్గుతో దేవదాసుకో అనుమానం కూడా వచ్చింది. నాలుగో బస్తాండు ప్రేమ రః చదువుల సరస్వతేనేమో అని.



"అంత పాపిష్టి చదువు ఎందుకు చదవటం పార్వతి ఇంకా నిద్రలేవలేదు మనం వెళ్ళి టీ తాగొద్దాం పద" అన్నాడు దేవదాసు. అరగంట ప్రియురాలి కోసం వేచి ఉండటానికి విసుక్కుం టే వీడేం ప్రేమిస్తాడు. అనుమానమే అనిపించింది మిత్రుడికి.

తిరిగి ఎనిమిదిన్నరకి వస్తుంటే 'పార్వతి దర్శనం' అయింది. ఆవలిస్తూ బ్రష్ చేత్తో పట్టుకొని మెట్లెక్కుతూ వీళ్ళని చూసింది. మొహం మెరిసిపోయింది. ఒక్కసారిగా సిగ్గో, సంతోషమో తెలియని కంగారులో మేడమీదకు ఎగురుకుంటూ వెళ్ళిపోయింది.

మేడమీదెక్కి పచార్లుచేస్తూ బ్రష్ వేసుకుంటూ మధ్య మధ్యలో చూడనట్లు చూస్తూ నవ్వుతూ తిరుగుతున్నది.

దేవదాసుకు తాను పొరపాటు చేశానేమో అన్పించింది. ఆ పిల్ల ఇట్లా తను పనిలేకపోయినా కావాలని కనిపించటాన్ని బలహీనతగా అనుకుం టుందేమో అనుకున్నాడు.

"అదేమిట్రా అలా చూస్తావు? చూశావా పార్వతి నీకోసం ఎలా ఓరగా చూస్తుందో నీకేం పులకరింపు కలగటంలేదా?"

" నిండుగా నురగ బ్రష్ నోట్లో పెట్టుకొని బరబరా రుద్దుతూ మేడమీద నిలబడి అలా అనవసరంగా నవ్వుతూ ఉంటే పులకరింపు కాదు, జలదరింపుగా ఉంది" అందామనుకొన్నాడు.

మిత్రుడి వైపు ఒకసారి చూసి తన మీద తనే జాలి పడుతున్నట్లు నవ్వాడు. క్రింద నుంచి పార్వతి నాయనమ్మ కేకవేసింది "ఆమొహం కడగటం పూర్తి చేసి ఇక దిగిరా!"

పార్వతి ఏదో గొణిగింది మొహంలో మార్పు బట్టి పార్వతి మాటలు కూడా ఇందాక చదువుల సరస్వతి తిట్టిన తిట్లే అయి ఉంటాయి అనుకున్నాడు దేవదాసు.

వెళ్ళిపోదామనుకున్నాడు. కానీ మిత్రుడికిచ్చిన 'ఒకరోజు గడువుకోసం ఆగాడు. ఓ పావు గంట తర్వాత అన్నయ్య కొడుకుని ఒక్కణ్ణి ఎత్తుకొచ్చి కిటికీ దగ్గర నిలబడి కాఫీ తాగుతూ వీళ్ళకేసి చూస్తూ, వీళ్ళకు వినిపించేటట్లు పసి వెధవతో పిచ్చి కబుర్లు మొదలు పెట్టింది.

"అదుగదుగో.... అటు... అటు చూడు బాగుంది కదూ! రా! రా! అను, గుడ్మార్నింగ్ చెప్పు" అంటూ కాసేపు 'ఓ దేవదా' అని కూనిరా గం తీస్తూ కాసేపు ఆ పసివాడ్ని ఎగరేసి ముద్దు పెట్టుకొని కిందపడేస్తూ...

మిత్రుడివైపుకూడా చూడకుండా లేచిపోయాడు దేవదాసు.

కొడుకు చెప్పింది విని నవ్వాగలేదు ఎస్వీ రావుగారికి.

"అదేమిట్రా డీడీ... ఆ పిల్ల కళ్ళు, నీకళ్ళు కలిసి మాట్లాడుకోవటం... ఏం కమ్యూనికేషన్ లేదా... ఆ పిల్ల నీవైపు చూస్తూనే ఉందన్నావుగా?

"ఆ ఆ ఇద్దరం సంకేతాలు పంపించుకున్నాం. ఆ పిల్ల కళ్ళు మనస్సులోంచి కిరణాలు పంపించినట్లున్నాయి. నా కళ్ళేమో నా మెదడు లోంచి కిరణాలు పంపించాయి. ఈ తేడావల్ల అవి పారలల్‌గా శూన్యంలోకి దూసుకుపోయాయి. ఇకచాలు. మీరు త్వరగా బయలుదేరితే ఊళ్ళో 'గాన్ విత్ ది విండ్' ఆడుతుంది. నన్ను సినిమాకితీసికెళ్ళొచ్చు".

చిగురుపాటి మూర్తి